

# శ్రీ వేంకటేశ్వర లీలలు


## స్వామిలీల

**కుమారి అపర్ణ చిట్టి**

వేపగుంట


మా ఊరు విశాఖపట్నం, కృష్ణరాయ పురం గ్రామము. మా ఇంటి ఇలవేల్పు దేవాది దేవుడు, కోరిన వరాలు ఇచ్చే కల్ప తరువు శ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి. ఆయన మహిమ వర్ణించ నలవి కానిది.

మా నాన్నగారికి అమ్మగారికి శ్రీస్వామి వారు అంటే చాలా అభిమానము. నాకు శ్రీస్వామివారి గురించి చాలా కబుర్లు చెప్పతూ యుండెడివారు. కాని నాకు దేవుడంటే పెద్దగా నమ్మకం లేదు. మా నాన్నగారు చెప్పినా విన నట్లు నటించేదానను.

1999 వ సంవత్సరములో నేను ఇంటర్మీడియట్ పాసై, మెడికల్ ఎంట్రెన్స్ వ్రాశాను. నేను చాలా కష్టపడి చదివాను. మా కాలేజీలో నాకు తప్పకుండా మెడికల్ సీటు వస్తుందని అందరూ భావించారు. ఆ సంవత్సరములో Armed Forces Medical Course కు కూడా వ్రాత పరీక్ష వ్రాశాను. మెడికల్ ఎంట్రెన్స్‌లో మంచి రాంకు రాకపోవడంవలన నేను చాలా బాధపడ్డాను. మానాన్నగారు ధైర్యం చెప్పారు. నాన్నా! నీవు బాధపడకు. ఆ కలియుగ దైవం నిన్ను కాపాడుతారు అని. మానాన్నగారి మాటను పట్టించుకోలేదు.

తరువాత బి.ఎస్.సి., లో చేరాను. ఆ తరువాత వ్రాత పరీక్షకు Armed forces medical courses గురించి వెళ్లాము. అక్కడనుండి పూరీ - జగన్నాద్ వెళ్లి అక్కడ దర్శనము చేసుకొని ఇంటికి తిరిగి వచ్చాము.

2,3, నెలల తరువాత వ్రాత పరీక్ష పాసయినట్లు వర్తమానము వచ్చింది. మెడికల్ ఎగ్జామినేషన్ గురించి బెంగుళూరు రమ్మనమని ఉత్తరము వచ్చింది. మా నాన్నగారి ఆనందం అంచులు దాటినవి. నేను కాలేజి నుండి వచ్చునప్పటికి మానాన్నగారు ఆ విషయాన్ని తెలియజేశారు. ఇది అంతయూ శ్రీ స్వామివారి కరుణా కటాక్షములేనని



నమ్మాను. నాకు శ్రీస్వామివారి ఋణముఎలా తీర్చుకోవాలో అర్థం కాలేదు.

మానాన్నగారు, అమ్మగారు కలిసి అందరమూ బెంగుళూరు నుండి తిరుపతి వెళ్లాలని నిశ్చయించుకున్నాము. బెంగుళూరు మెడికల్ ఎగ్జామినేషన్ తరువాత నాకు శ్రీస్వామివారు అంటే భయము మొదలైనది. ఎందుకంటే అతని ఎడల ఏదైనా తప్పు చేస్తున్నానేమోనని నా మనస్సు పరితపించి పోయేడిది. బెంగుళూరులో వారంరోజుల అనంతరం అక్కడ Provisionally Selected అని చెప్పారు.

మా నాన్నగారు, అమ్మగారు నాన్నా! చూసావా? శ్రీస్వామివారి లీలలు. ఇప్పటికైనా శ్రీస్వామివారిని నమ్ముతావా? లేదా? అని అడిగాను. నాకు నోటి మాట రాలేకపోయింది. ఆ ఆనందాన్ని తట్టుకోలేక నేను నా తనివి తీరా ఏడ్చాను. ఎందుకంటే నా చిన్ననాటినుండి ఇంతవరకూ శ్రీస్వామివారిని నమ్మకుండా అశ్రద్ధ చేసాను. అందుచేత నా మనసు పరితపించి బాధతో నేను చేసిన తప్పుకు, స్వామిని నిర్లక్ష్యం చేసినందుకు ఏడ్చాను.

ఇపుడు నేను కలకత్తాలో వుంటున్నాను. గత సం శ్రీస్వామివారిని దర్శించాను. ఈ సం కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించాను. స్వామివారి కరుణా కటాక్షాలు లేనట్లయితే నేను ఈ ఉన్నత స్థితికి వచ్చేదానిని కాదు. ఇదంతా ఆ స్వామిలీలే!